ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 2 | సంచిక: 311 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 17 ఫిబ్రవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి




అధికారులు ఏసీ గదులు వీడేందుకు

## ఇష్టపడట్లేదు

### సీఎం రేవంత్‌రెడ్డి

### అధికారులు ఎంత నిబద్ధత చూపితే పథకాలు అంత విజయవంతమవుతాయి

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం):** అధికారులు ఎంత నిబద్ధత చూపితే పథకాలు అంత విజయవంతమవుతాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి గోపాలకృష్ణ రచించిన 'లైఫ్ ఆఫ్ ఏ కర్మ యోగి- మెమైర్ ఆఫ్ ఏ సివిల్ సర్వెంట్' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం హైదరాబాద్‌లోని బేగంపేటలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారులు క్షేత్రస్థాయిలో ఎంత తిరిగితే అంత మంచిదన్నారు. కానీ, ఇప్పటి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లేందుకు సుముఖంగా లేరని, ఏసీ గదుల వీడేందుకు ఇష్టపడట్లేదని వ్యాఖ్యానించారు. "నిబద్ధత కలిగిన అధికారులను గుర్తించి ప్రాధాన్యత ఇస్తున్నాం. పాలకులు ఎన్ని పాలసీలు చేసినా.. అమలు చేసేది అధికారులే. క్షేత్రస్థాయిలో బాగా పనిచేసిన వారిని ప్రజలూ గుర్తుంచుకుంటారు. మనకున్న జ్ఞానం, అధికారం పేదలకు ఉపయోగపడాలి" అని సీఎం అన్నారు. సీఎస్ శాంతి కుమారి, పలువురు ఉన్నతాధికారులు పుస్తకావిష్కరణలో పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం, నిర్వహణ లోపం వల్లే

## ఢిల్లీ తొక్కిసలాటపై విపక్షాలు ఫైర్

### ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 18మంది మృతి

### కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డ విపక్షాలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం):** ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటపై కేంద్ర ప్రభుత్వంపై విపక్షాలు మండిపడ్డాయి. రైల్వేశాఖ నిర్లక్ష్యంతోనే తొక్కిసలాట జరిగిందని కాంగ్రెస్ ఆరోపించింది. మహా కుంభమేళా కోసం ప్రయాగ్‌రాజ్‌కు భారీ సంఖ్యలో భక్తులు వెళ్తున్నందున రైల్వే స్టేషన్‌లో మెరుగైన ఏర్పాట్లు చేసి ఉండాల్సిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు.

**'ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యం వల్లే!'**

"తొక్కిసలాట ఘటన మరోసారి రైల్వే శాఖ వైఫల్యాన్ని, ప్రభుత్వ అసమర్థతను ఎత్తి చూపింది. నిర్వహణ లోపం, నిర్లక్ష్యం కారణంగానే అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. తొక్కిసలాటలో అనేక మంది మరణించడం, గాయపడటం చాలా బాధాకరం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలి." అని ఎక్స్‌లో రాహుల్ పోస్ట్ చేశారు.

**మృతుల సంఖ్యను వెల్లడించండి : ఖర్గే**

తొక్కిసలాట మరణాల సంఖ్యను దాచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం సిగ్గుచేటు అని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. "తొక్కిసలాటలో చాలా మంది మరణించారనే వార్తలు నన్ను బాధించాయి. ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారి ..మిగతా 2లో



హిందూ సమాజం

## ఐక్యంగా ఉండాలి

### మోహన్ భాగవత్

### హిందూ సమాజ ఐక్యతకు ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ పిలుపు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం):** ప్రపంచంలోని వైవిధ్యాన్ని ప్రజలు ఆమోదించాల్సిన అవసరం ఉందని 'రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్' చీఫ్ మోహన్ భాగవత్ పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వం ఉంటుందనే సత్యాన్ని హిందూ సమాజం విశ్వసిస్తోందన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని బర్ధమాన్‌లోని సాయ్ మైదానంలో జరిగిన ఆరెస్సెస్ కార్యక్రమంలో భాగవత్ మాట్లాడుతూ.. మనం కేవలం హిందూ సమాజంపైనే ఎందుకు దృష్టి పెడతామని ప్రజలు తరచుగా అడుగుతారని అన్నారు. దీనికి సమాధానంగా దేశంలో బాధ్యతాయుతమైన సమాజం ఏదన్నా ..మిగతా 2లో



కృష్ణా జలాలను ఏపీ తరలించుకుపోతుంటే..

## ఏం చేస్తున్నారు

### సీఎం రేవంత్ రెడ్డిని నిలదీసిన హరీశ్‌రావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం):** తెలంగాణ నీటి ప్రయోజనాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గండి కొడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తుండటం దుర్మార్గమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు విమర్శించారు. కృష్ణా జలాలను ఏపీ అడ్డూ అదుపూ లేకుండా తరలించుకుపోతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల ..మిగతా 2లో

# బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్



### తెలంగాణలో చేపలు, మటన్‌కు భారీగా పెరిగిన గిరాకీ

### రేట్లు పెంచి విక్రయిస్తున్న వ్యాపారులు

### మాంసప్రియుల జేబులకు చిల్లులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం):** బర్డ్ ఫ్లూ సోకి కోళ్లు చనిపోతున్న నేపథ్యంలో ముందు జాగ్రత్తగా కొంతమంది ప్రజలు చికెన్ తినేయడం మానేస్తున్నారు. ఈ క్రమంలో పలు ప్రాంతాల్లో చేపలు, మటన్ షాపుల వద్ద జనం క్యూ కట్టారు. దీంతో చికెన్ వ్యాపారులు కస్టమర్లు లేక దుకాణాల్లో ఖాళీగా కూర్చుంటున్నారు. మరోవైపు చేపలు, మటన్ అమ్మకాలు జోరందుకున్నాయి. ఈ క్రమంలో చేపల రేట్లు ఒక్కసారిగా పెంచి అందినకాడికి స్వాహా చేస్తున్నారు వ్యాపారులు. గతంలో కిలో మటన్ ధర రూ.700 నుంచి 800కు విక్రయించేవారు. ప్రస్తుతం రూ.50 నుంచి రూ.100 వరకు పెంచి అమ్ముతున్నారు. మాంసం ..మిగతా 2లో



## కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం

### తెలంగాణ భవిష్యత్తు అయిన భావితరాలకు శాపం : కేటీఆర్

2

కులగణనపై ఈటల

## కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం):** యాదాద్రి భువనగిరి జిల్లా:కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణన ఒక డ్రామా అని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. యాదగిరిగుట్టలో ఆదివారం(ఫిబ్రవరి16) ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడారు. 'బీసీ గణనను చట్టబద్ధమైన సంస్థలతో సర్వే చేసి అసెంబ్లీలో చట్ట బద్ధత కల్పించాలి. బీసీ కుల గణనకు బీజేపీ వ్యతిరేకం కాదు. కులగణనను పార్లమెంట్‌లో ఆమోదించేందుకు సిద్ధంగా ఉన్నాం. 70ఏళ్ళ కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీ సీఎం కూడా లేడు. సామాజిక న్యాయం గురించి మాట్లాడే అర్హత ..మిగతా 2లో

# 10 రోజుల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు

### కూటమి నేతలు సమన్వయంతో పనిచేయాలి: చంద్రబాబు



**అమరావతి, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం):** ఫిబ్రవరి 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించేలా కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన స్ట్రైక్ రేట్ రిపీట్ అవ్వాలని కూటమి నేతలకు ముఖ్యమంత్రి సూచించారు. ప్రతి ఎన్నిక పరీక్షవంటిదేనని, కూటమి అభ్యర్థులు విజయం సాధించేలా ప్రతిఒక్కరూ కష్టపడాలని సూచించారు. 2024 ఎన్నికల్లో 93 శాతం స్ట్రైక్ రేట్‌తో కూటమిని రాష్ట్ర ప్రజలు గెలిపించారని, ఆ దిశగా ఇప్పుడూ ముందుకెళ్లాలని కోరారు. ఉమ్మడి గుంటూరు-కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కూటమి నేతలతో సీఎం చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. "ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం కోసం ..మిగతా 2లో




బైబిల్ సందేశాలను అందచేస్తున్న బిషప్ సుదర్శన్ జ్యోతి కొమానపల్లి

## యెహోవా యందు నమ్మికయుంచిన వారికి ఆశీర్వాదాలకు కొదువ ఉండదు

### బిషప్ సుదర్శన్ జ్యోతి కొమానపల్లి

బుద్వేల్ ఫిబ్రవరి16(ప్రభాత ఉదయం) : యెహోవా యందు నమ్మిక ఉంచాలని అప్పుడు దేవుడు వారి జీవితాలలో ఆశీర్వాదాలు కలుగ చేస్తాడని మన్నా మినిస్ట్రీస్ బిషప్ సుదర్శన్ జ్యోతి కొమానపల్లి అన్నారు. రాజేంద్రనగర్ మన్నా చర్చిలో ఆదివారం జరిగిన ఆరాధన కార్యక్రమంలో ఆయన పాల్గొని బైబిల్ సందేశాలను అందజేశారు. యిర్మియా 17.8వ వచనంలో వ్రాయబడియున్నట్లు 'వాడు జలములయొద్ద నాటబడిన చెట్టువలే నుండునుబీ అది కాలువల ఓరను దాని వేళ్లు తన్నునుబీ వెట్ట కలిగినను దానికి భయపడదు. దాని ఆకు పచ్చగానుండును. వర్షములేని సంవత్సరమున చింత నొందదు కాపు మానదు. అనే విదంగా ఆయనపై ఆధారపడి జీవించే వారి జీవితాలలో ఉంటుందన్నారు. అదే విషయాన్ని బైబిల్ లో యిర్మియా 17.7లో యెహోవాను నమ్ముకొను వాడు ధన్యుడు. యెహోవా వానికి ఆశ్రయముగా ఉండును అని ఉంటుందని గుర్తు చేశారు. క్రైస్తవ జీవితంలో ఆశీర్వాదాలు. వాగ్దానాలు ఊరికే నెరవేరవని, దేవుని వాక్యానుసారంగా జీవించాల్సి ఉంటుందన్నారు. బైబిల్ లో చెప్పినట్లు 'దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా తన అద్వితీయ కుమారునిగా పుట్టినవాని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను మనకు అనుగ్రహించెను'. అని గుర్తు చేశారు. వస్తువులను వాడటంలో కాలపరిమితులు ఉంటాయని, స్త్రీలు ఫలించడానికి వయస్సు పరిమితి ఉంటుందని దేవుని ఆశ్రయిస్తే సదాకాలం ఆయన ఆశీర్వాధాలు కుమ్మరిస్తునే ఉంటారన్నారు. అందుకే క్రైస బివులు వారి జీవితాలను మార్చుకోవడానికి ఇష్టపడాలన్నారు. అలవాట్లు, పద్దతులు మార్చుకోవడం అంతా సులభం కాదని, అయితే మార్చుకోవడానికి ఇష్టపడితే అది సులభంగానే ఉంటుందన్నారు. అదంతా దేవునిపై ఆధారపడినప్పుడే సాధ్యమని బిషప్ సుదర్శన్ జ్యోతి కొమానపల్లి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మన్నా చర్చి పాస్టర్ రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్, పాస్టర్ పీటర్ తదితరులు పాల్గొన్నారు. బైబిల్ సందేశాలను అందజేసిన బిషప్ సుదర్శన్ జ్యోతి కొమానపల్లిని మన్నా చర్చి తరపున రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్, సిస్టర్ సీహెచ్ ప్రభావతి లు సన్మానించారు.



డాక్టర్ ఫణి విజ్ఞాన్ - డాక్టర్ స్నేహిక నిశ్చితార్థ వేడుక లో పాల్గొన్న జర్నలిస్టులు

## ఘనంగా డాక్టర్ ఫణి విజ్ఞాన్-డాక్టర్ స్నేహిక నిశ్చితార్ధ వేడుక

బుద్వేల్, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్దేవుపల్లి డివిజన్ టీఎన్జీవోస్ కాలనీ ని ఆనుకొని ఉన్న సాయి కాలనీ కి చెందిన జర్నలిస్టు సంఘం నాయకులు, శ్రీ సాయి గ్రామర్ హై స్కూల్ నిర్వాహకులు ఏ పి చారి - శ్రీలక్ష్మి ల కుమారులు డాక్టర్ ఫణి విజ్ఞాన్ నిశ్చితార్థం ఆదివారం శివరాంపల్లి వాస్తవ్యులు , రాజేంద్రనగర్ మండల గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షులు , శ్రీ గాయత్రీ హై స్కూల్ నిర్వాహకులు ఎం. ప్రభాకర్ చారి - లలిత ల కుమార్తె డాక్టర్ స్నేహిత తో ఘనంగా జరిగింది . పిల్లర్ నెంబర్ 230 వద్ద గల గ్రాండ్ సెలబ్రేషన్ బంకెట్ హాల్ లో జరిగిన నిశ్చితార్థ వేడుకలకు ఇరు కుటుంబాల కు చెందిన బంధువులు , స్నేహితులు పెద్ద సంఖ్యలో హాజరైనారు. నిశ్చితార్థ వేడుకలలో జర్నలిస్ట్ సంఘం నాయకులు అప్పారెడ్డిగూడెం భీమయ్య, మేకల దామోదర్ రెడ్డి, వర్కాల చందు, గద్దె యాదగిరి లు పాల్గొన్నారు.

## 10 రోజుల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి...

మూడు పార్టీల అభ్యర్థులూ కలిసికట్టుగా పనిచేయాలి. క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకోవాలి. ఓటర్లను చైతన్యపరచాలి. 2024 ఎన్నికల్లో 93 శాతం స్ట్రైక్ రేట్‌తో కూటమికి ప్రజలు తీర్పునిచ్చారు. అలాంటి గెలుపు కోసం కృషి చేయాలి. ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇంకా 10 రోజులు మాత్రమే సమయం ఉంది. మూడు పార్టీల నేతలు నిత్యం సమన్వయంతో ఉండాలి. నేతలు కూటమి ధర్మాన్ని పాటిస్తూ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించకుండా విజయం కోసం పని చేయాలి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వచ్చే మెజారిటీ సార్వత్రిక ఎన్నికల్లో వచ్చిన దాని కంటే మెరుగ్గా ఉండాలి.ఆంధ్రప్రదేశ్ ప్రజలు మనకు పట్టం కట్టారు. వారి నమ్మకాన్ని నిలబెట్టేందుకు ప్రతిరోజూ పని చేస్తున్నాం. వ్యవస్థలను గాడిలో పెట్టి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించాం. పాలనలో స్పష్టమైన మార్పు తీసుకొచ్చాం. బ్రాండ్ ఏపీతో పెట్టుబడులు సాధించి యువతకు ఉద్యోగాలు కల్పించే ప్రయత్నం చేస్తున్నాం. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెట్టుబడిదారుల్లో నమ్మకం కల్పించాం. దాదాపు రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులకు పైగా ఒప్పందాలు కుదుర్చుకున్నాం. దీని ద్వారా 4 లక్షలకు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా రాష్ట్రమంతటా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి నెలా 64 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నాం. 16,347 టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వబోతున్నాం. గత ప్రభుత్వం విద్యార్థులకు బకాయిపెట్టిన ఫీజురీయింబర్స్‌మెంట్‌లో రూ.780 కోట్లు చెల్లించాం. ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రతినెలా ఒకటో తేదీనే డబ్బులు చెల్లిస్తున్నాం. విద్యావంతులైన మహిళలకు వర్క్ ఫ్రమ్ హోమ్ ద్వారా ఆదాయ మార్గాల కల్పనకు ఆలోచనలు చేస్తున్నాం. ఇవన్నీ 8 నెలల్లోనే కూటమి ప్రభుత్వం చేపట్టింది. చేసిన మంచి కార్యక్రమాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కూటమి నేతలపై ఉందని" చెప్పారు.

## కులగణనపై ఈటల కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి...

కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదు. కాంగ్రెస్ అంటేనే స్కామ్‌లు, భూ దందాలు,లంచాలు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డబ్బు సంచులతో ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దల చుట్టూ తిరుగుతున్నాడు.ప్రధాని మోదీపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు చిల్లరగా ఉన్నాయి. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో మూడు స్థానాల్లో బీజేపీ గెలుస్తుంది. బీఆర్ఎస్ గతంలో టీచర్లను మోసం చేసి పోటీ చేసే అర్హత కోల్పోయింది'అని ఈటల అన్నారు.

# ఘనంగా పాల్వాయి శ్రీనివాస్ నాయి కుమార్తె వివాహం



తరుణి-హరికృష్ణల వివాహానికి హాజరైనా తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



పాల్వాయి శ్రీనివాస్ నాయి కుమార్తె తరుణి వివాహానికి హాజరైనా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

బుద్వేల్, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు పాల్వాయి శ్రీనివాస్ నాయి కుమార్తె తరుణి వివాహం ఆదివారం కదారి నరేందర్ కుమారుడు హరికృష్ణ తో ఘనంగా జరిగింది. ఆదామ్ కేర్ మెట్రో కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ లో అంగ రంగ రంగ వైభవంగా జరిగిన ఈ వివాహ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర శాసనసభాధిపతి గడ్డం ప్రసాద్ కుమార్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ తో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి నాయి బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు హాజరైనారు. వివాహ వేడుకలకు ఇరు కుటుంబాల బంధువులు, స్నేహితులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరై నూతన వధూవరులైన తరుణి - హరికృష్ణ లను ఆశీర్వదించారు. వివాహ వేడుకలలో పాల్వాయి శ్రీనివాస్ నాయి అన్న పాల్వాయి లక్ష్మీనారాయణ నాయి , పాల్వాయి నిర్మల కుటుంబ సభ్యులు దగ్గరుండి ఏర్పాట్లు చూశారు. వివాహ వేడుకల్లో జర్నలిస్టు సంఘం నాయకులు అప్పారెడ్డిగూడెం భీమయ్య, మేకల దామోదర్ రెడ్డి, వర్కాల చందు, గద్దె యాదగిరి లు పాల్గొన్నారు.



పాల్వాయి శ్రీనివాస్ నాయి కుమార్తె తరుణి వివాహానికి హాజరైనా జర్నలిస్టులు

## కృష్ణా జలాలను ఏపీ తరలించుకుపోతుంటే.. ఏం చేస్తున్నారు

మొదటి పేజీ తరువాయి...

శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మూడు నెలలుగా నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి రోజుకు 10వేల క్యూసెక్కులను ఏపీ తరలించుకుంటుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని నిలదీశారు.ఈ వాటర్ ఇయర్ లోనే 646 టీఎంసీలు తరలిస్తే ఎందుకు నోరు మెదపడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హరీశ్‌రావు ప్రశ్నించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాంగ్రెస్ కు పట్టవా అని నిలదీశారు. సాగర్ ఆనకట్ట కేంద్ర బలగాల ఆధీనంలో ఉందని.. వారి పర్యవేక్షణలో మాత్రమే నీటిని విడుదల చేసుకోవాల్సి ఉన్నప్పటికీ ఏపీ మాత్రం ఇష్టారాజ్యంగా నీటిని తరలిస్తున్నదని విమర్శించారు. తెలంగాణ తాగునీటి అవసరాలకు శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నిలువ ఉంచాల్సిన కోటాను ఏపీ తీసుకెళ్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేదని మండిపడ్డారు.శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో మిగులు నిల్వలు లేకున్నా పోతిరెడ్డిపాడు, సాగర్ కుడి కాల్వ ద్వారా ఇప్పటికే ఏపీ నీటిని తరలిస్తూ మొండిగా వ్యవహరిస్తుందని హరీశ్‌రావు విమర్శించారు. ప్రతి సంవత్సరం ఉమ్మడి ప్రాజెక్టులకు సంబంధించి నీటి వినియోగానికి కేఆర్ఎంబీ పరిధిలోని త్రిమెన్ కమిటీ సమావేశం నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. కానీ ఈ ఏడాది ఇంతవరకు త్రిమెన్ కమిటీ మీటింగ్ పెట్టలేదని.. అంటే బోర్డు వ్యవహారం ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. బోర్డు పై ఒత్తిడి చేయడంలో, నీటి తరలింపు చేయకుండా ఏపీని నిలువరించడంలో తద్వారా తెలంగాణ నీటి హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ సర్కారు ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఏపీ దూకుడు, తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్య వల్ల ఇప్పటికే నాగార్జున సాగర్, శ్రీశైలం రిజర్వాయర్లు ఖాళీ అయిన పరిస్థితి నెలకొందని హరీశ్‌రావు అన్నారు. మరోవైపు వేసవి పూర్తిగా మొదలు కాలేదు తెలంగాణ రైతులు నీళ్ళ కోసం రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారని హరీశ్‌రావు అన్నారు. ఏపీ నీటి తరలింపును ఇప్పటికైనా అడ్డుకోకపోతే సాగర్ ఆయకట్టుకు ప్రమాదం ఏర్పడనుందని తెలిపారు. సాగర్ లో నీటిమట్టం పడిపోతే హైదరాబాద్ నగరానికి తాగునీటి సమస్య సైతం ఏర్పడుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి ఏపీ నీటి దోపిడిని అడ్డుకోవాలని, ఈమేరకు కృష్ణ బోర్డుపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం): రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి సర్కార్.. గురుకుల విద్యాసంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం వల్ల తెలంగాణ భవిష్యత్ అయిన భావితరాలకు శాపంగా మారిందని విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎవరెస్ట్ శిఖరమంత ఎత్తు ఎదిగిన గురుకులాలు.. ఏడాది కాంగ్రెస్ పాలనలో అస్తవ్యస్తమై అధ్వాన్న స్థితికి చేరాయని కేటీఆర్ పేర్కొన్నారు. నాడు డాక్టర్లు, ఇంజనీర్ వంటి ఉన్నత చదువులు చదివిన విద్యార్థులు.. నేడు సరైన దిశానిర్దేశం లేక ధీన పరిస్థితి ఎదుర్కొంటున్నారు. నాడు గురుకులాల్లో సీటు కోసం పోటీ పడిన విద్యార్థులు.. నేడు గురుకులం పేరు చెబితే డీలా పడిపోతున్నారు. నాడు కడుపునిండా అన్నం తిని, అనుకున్న లక్ష్యాలను సాధిస్తే% నేడు అన్నమో రామచంద్ర అనే రోజులొచ్చాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. నాడు 41 వేల సీట్లకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష రాసేందుకు లక్షా 68 వేల దరఖాస్తులు వస్తే.. నేడు 51 వేల సీట్లకు గాను 80 వేల దరఖాస్తులే వచ్చాయి. ఏడాది పాలనలో 50కి పైగా విద్యార్థులు ఫుడ్ పాయిజన్, ఇతర కారణాలతో మరణించినా కాంగ్రెస్ సర్కారులో కనీస చలనం లేదు. చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు కనీస పరామర్శ లేకపోగా.. అంత్యక్రియలకు, పరామర్శకు వెళ్లే ప్రతిపక్షం మీద ఈ ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తున్నది అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జాగో తెలంగాణ జాగో! అని కేటీఆర్ నినదించారు.

## హిందూ సమాజం ఐక్యంగా ఉండాలి

మొదటి పేజీ తరువాయి...

ఉందంటే.. అది కేవలం హిందూ సమాజమేనని తాను చెబుతానని అన్నారు. హిందూ సమాజం మరింత ఐక్యంగా ఉండాలని పునరుద్ఘాటించారు. మంచి సమయాల్లోనూ సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని..దానికి సమాజంలోని ప్రజల మధ్య ఐక్యత అవసరమని అన్నారు. ప్రజలు దేశాన్ని పాలించిన చక్రవర్తులు, మహారాజులను గుర్తు పెట్టుకోరని..తండ్రి వాగ్దానాన్ని నెరవేర్చడానికి 14 ఏళ్లు అజ్ఞాతవాసం చేసిన రాజును గుర్తుంచుకుంటారని అన్నారు. 200ఏళ్ల పాటు మన దేశాన్ని పాలించిన బ్రిటిషు వారు దేశ ప్రజలను విడదీయాలని చూశారన్నారు. స్థానిక ప్రజలు దేశాన్ని పరిపాలించడానికి పనికిరారని ప్రచారం చేసి, భారత దేశ చరిత్రను బ్రిటిష్ పాలకులు వక్రీకరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బర్ధమాన్‌లో ఆరెస్సెస్ సమావేశం నిర్వహణకు అనుమతి ఇవ్వాలని కోరగా మొదట పశ్చిమ బెంగాల్ పోలీసులు నిరాకరించారు. అనంతరం దీనిపై కలకత్తా హైకోర్టుకు వెళ్లి అనుమతులు పొందారు.

## నిర్లక్ష్యం, నిర్వహణ లోపం వల్లే

మొదటి పేజీ తరువాయి...

సంఖ్య దాచడానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం చేసిన ప్రయత్నం చాలా సిగ్గుచేటు, ఖండించదగినది. మృతులు, గాయపడిన వారి సంఖ్యను ప్రభుత్వం వీలైనంత త్వరగా ప్రకటించాలి." అని ఖర్గే ఎక్స్‌లో పోస్టు చేశారు.

**'ఆ విజువల్స్ భయంకరంగా ఉన్నాయి'**

ప్రభుత్వ అసమర్థత కారణంగానే తొక్కిసలాట ఘటన జరిగిందని కాంగ్రెస్ పార్టీ నేత కేసీ వేణుగోపాల్ ఎక్స్ వేదికగా ఆరోపించారు. "ఇది తీవ్ర విషాదకరం. ఢిల్లీ రైల్వే స్టేషన్ నుంచి వచ్చిన దృశ్యాలు భయంకరంగా ఉన్నాయి. కేంద్రం పర్యవేక్షణలో, దేశ రాజధానిలో ఇలాంటి ఘటన జరగడం పూర్తిగా ప్రభుత్వ అసమర్థతే. మరణించిన, గాయపడినవారి కచ్చితమైన గణాంకాలు ఎప్పుడు తెలుస్తాయి?. రద్దీ నియంత్రణకు చర్యలు ఎందుకు తీసుకోలేదు?. కుంభమేళా నేపథ్యంలో రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లను ఎందుకు నడపలేదు?" అని కేంద్ర ప్రభుత్వాన్ని కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు.

**నిర్వహణ లోపం వల్లేనన్న ఆప్**

ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట నిర్వహణ లోపం వల్లే జరిగిందని ఆప్ సైతం ఆరోపించింది. రద్దీ నియంత్రణ చర్యలు లేవడానికే ఇదొక స్పష్టమైన ఉదాహరణ అని విమర్శించింది. తొక్కిసలాటకు బాధ్యులను జవాబుదారీగా ఉంచాలని ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటన జరగకుండా తక్షణ సంస్కరణలను చేపట్టాలని కోరారు.

**లాలూ స్పందన**

రైల్వే శాఖ నిర్వహణ లోపం వల్లే తొక్కిసలాటలో 18 మంది ప్రాణాలు కోల్పోయారని ఆర్‌జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోపించారు. "ఈ సంఘటన చాలా దురదృష్టకరం. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నాను. ఈ ఘటనకు రైల్వే మంత్రి బాధ్యత వహించాలి" అని లాలూ విమర్శించారు.

కమిటీ ఏర్పాటు

మరోవైపు ఈ తొక్కిసలాటపై అత్యున్నత స్థాయి విచారణకు రైల్వే శాఖ ఆదేశించింది. ఈ క్రమంలో వేసిన విచారణ కమిటీకి ఇద్దరు ఉన్నత స్థాయి అధికారులను ఎంపిక చేసింది. ఉత్తర రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ నర్సింగ్ డియో, ఉత్తర రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ పంకజ్ గంగ్వార్ ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారని రైల్వే శాఖ ప్రకటించింది.

## బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్

మొదటి పేజీ తరువాయి...

ప్రియులు ఏమీ చేయలేక కొనుగోలు చేస్తున్నారు.అదే విధంగా చేపల రేట్లను కూడా పెంచి విక్రయిస్తున్నారు. రూ.150 నుంచి 160కు అమ్మే బొచ్చ, రవ్వ రకం చేపలను ఏకంగా రూ.200 కేజీగా అమ్ముతున్నారు. మధ్య తరగతి కుటుంబాలపై ఈ ధరలు ప్రభావం చూపుతున్నాయి. మొత్తానికి కోడికి వచ్చిన రోగానికి మాంస ప్రియుల జేబులకు చిల్లులు పడుతున్నాయి.కిక్కిరిసిపోయిన జనం : మరోవైపు హైదరాబాద్ పలు చేపల మార్కెట్లు కిటకిటలాడాయి. రాంనగర్‌లోని చేపల మార్కెట్లో జనాలు కిక్కిరిసిపోయారు. కొత్తపేటలోని చేపల మార్కెట్లో ఉదయం నుంచి చేపల విక్రయాలు భారీగా జరుగుతున్నాయి. బర్డ్ ఫ్లూ కారణంగా చికెన్ కొనుగోళ్లు తగ్గించిన జనం చేపలు, మటన్ తీసుకుంటున్నారు.

# విద్యార్థి లోకం తలచుకుంటే... అమెరికన్లు మన ఎంబసీ వద్ద వీసాలకు క్యూకట్టాలి

**10వ తరగతి విద్యార్థును ఉద్దేశించి మాజీ సీబీఐ జాయింట్ డైరెక్టర్ జెడి. లక్ష్మీ నారాయణ**

**ఎగ్జామ్స్ అంటే భయం వద్దు పరీక్షలు అనే పండుగ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూడాలి**

**దేశ ప్రధాని పిలుపు పాటిస్తూ, డా. అబ్దుల్ కలాం సూచించిన మూడు మాటలను లక్ష్యం చేసుకోవాలని విద్యార్థులకు హితవు**

**ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం సంయుక్తంగా**

**రాక్ చర్చ్ ఆడిటోరియంలో నిర్వహించిన మోటివేషన్ క్లాస్‌కు హా జరైన 5000 వేల మంది టెన్త్ విద్యార్థులు.**

బుద్వేల్, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం): నేటి విద్యార్థి లోకం తలచుకుంటే మనదేశ ఎంబసీ వద్ద అమెరికన్లు భారత దేశ వీసాల కోసం క్యూకట్టే రోజులు వస్తాయని మాజీ సీబీఐ జాయింట్ డైరెక్టర్ జే డి. లక్ష్మీ నారాయణ స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి వారి కన్న తల్లిదం డ్రులు గర్వపడేలా, తానుచదువుకున్న స్కూల్, కాలేజీకి చీఫ్ గెస్ట్ గా వెళతాను, మా సంతకాన్ని ఆటో గ్రాఫ్ గా మార్చుకుంటామనే మూడు లక్ష్యాలను పెట్టుకుంటే చాలు దేశం ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలోకి వెళ్లడం ఖాయమని ఆయన ఉద్ఘాటించారు. రాజేంద్ర నగర్, గండిపేట మండలాల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాల ల యాజమాన్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కిస్మత్ పూర్ రాక్ చర్చి ఆడిటోరియంలో ప్రేరణ పేరిట నిర్వహించిన 10 వ తరగతి విద్యార్థుల మోటివేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి జే డి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ, ఒక సంవత్సరంలో వచ్చే పండుగల కోసం మనం వేచి ఉంటామని, అదే విధంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు విద్యార్థులు పరీక్షలను ఓ పండుగగా భావించి ఎప్పుడు పరీక్షలు వస్తాయా అని వేచి చూడాలని చెప్పారు. అందుకోసం రోజుకు ఏడు నుంచి ఎనిమిది గంటలు చదువుకోవడంతో పాటు పరీక్షలు పూర్తి అయ్యే వరకు సెల్ ఫోన్లను పక్కన పెట్టాలని సూచించారు. భారత జట్టు కెప్టెన్ గా దోని వరల్డ్ కప్ కోసం, పీవి సింధు పతకం సాధించడానికి వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ చేశారని గుర్తు చేశారు. విద్యార్థులు పుస్తకం చదువుతున్నప్పుడు అందులో నుంచి ఏ విధంగా ప్రశ్న వస్తుందనే అంశం పై దృష్టి సారించాలన్నారు. పరీక్ష కేంద్రం లోకి వెళ్లాక కొద్ది సేపు ఎవ్వరితో మాట్లాడవద్దని, ప్రశ్నాపత్రం ఇచ్చాక దానిని పూర్తిగా చదవాలని, అప్పుడు అందులో మీకు వచ్చినవి.... రానివి ఏమిటో గ్రహిస్తారన్నారు. రాసిన పరీక్ష జవాబు పత్రాలను అడిషనల్ పేప ర్లు ఒకసారి సరి చేసుకుని క్రమ పద్ధతిలో పెట్టి ఇవ్వాలన్నారు. పరీక్షలకు వెళ్లె పదో తరగతి విద్యార్థులను చూసి 21వ తేదీ నుంచి తెలంగాణలో పరీక్ష పేపర్లు భయపడాలన్నారు. పదవ తరగతి విద్యార్థులైన మీ ఈ ఒక్క జనరేషన్ దేశాన్ని మార్చగలదన్న ఆశాభావం ఆయన వ్యక్తం చేశారు. మాజీ రాష్ట్రపతి దివంగత ఏపీజే అబ్దుల్ కలాం చెప్పిన మూడు మాటలను విద్యార్థులు నేర్చుకోవాలని సూచించారు. మొదటిది మీ అమ్మానాన్నలు మిమ్మల్ని చూసి గర్వపడాలి, రెండవది మీరు చదువుకున్న స్కూల్ లేదా కాలేజీకి చీఫ్ గెస్ట్ గా వెళ్లాలి, మూడు మీ సంతకాన్ని జనంలోకి వెళితే ఆటో గ్రాఫ్ మార్చుకోవడమే అన్నారు. అందుకు ఏకగ్రాతతో చదువుకుంటేనే అది సాధ్యమని, పరీక్షలు అంటే భయం పోయి, పండుగలాంటి పరీక్షలు ఎప్పుడు వస్తాయా..? అని విద్యార్థులు వేచి చూడాల్సిన వాతావరణం ఏర్పర్చుకోవాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎ. భరత్ కుమార్, జిల్లా సలహాదారు డా. జగన్మోహన్ రెడ్డి, డా.సి.ఎన్.రెడ్డి, శిరీష ఎవిఎస్, రాజేంద్రనగర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం .ప్రభాకరాచారి. జి. శరవణ్ కుమార్, కోశాధికారి ఎస్ఆర్ రజినీకాంత్, కల్చరల్ సెక్రెటరీ బోయ లక్ష్మణ్, మండల సంఘం మాజీ అధ్యక్షుడు డా ఎం సంజీవ, రాంబాబు, గండిపేట్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనంద్, నర్సింహారెడ్డి, ప్రతినిధిలు ఏ పి చారి, ప్రకాష్ సింగ్, యాదగిరి, పి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ సీబీఐ జాయింట్ డైరెక్టర్ జే డీ లక్ష్మీనారాయణ



పాల్గొన్న విద్యార్థులు



చాకలిగూడ నుంచి శ్రీశైలం వెళుతున్న స్వాములు

## కాలినడకన శ్రీశైలానికి బయలుదేరిన చాకలిగూడ గ్రామ శివ స్వాములు

మొయినాబాద్, ఫిబ్రవరి 16(ప్రభాత ఉదయం) మండలంలోని చాకలిగూడ గ్రామంలో శివ స్వాములు శివ నామ స్మరణతో శివస్వాముల పడి పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రామానికి చెందిన శివస్వాములు ఇరుముడితో శ్రీశైలం ఆలయానికి బయలుదేరి వెళ్లారు . ఈ కార్యక్రమంలో గ్రామస్థులు ,శివ స్వాములు పాల్గొన్నారు.



## నేడు కిస్మత్‌పూర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేత

బండ్లగూడ, ఫిబ్రవరి 16(ప్రభాత ఉదయం) కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం సోమవారం సరఫరా నిలిపి వేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజ్ తెలిపారు. రాక్ చర్చ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు శ్రీ సాయి కాలనీ, ప్రభుత్వ పాఠశాల, రాఘవేంద్ర కాలనీ, ఫైన్ ఆర్ట్స్ కాలనీ, ఎన్నారై టౌన్షిప్, రాధా రియాలిటీ, వివేకానంద కాలనీ, యాదాద్రి కాలనీ, ఓం నగర్ కాలనీ, ఎస్ ఎం ఎంక్లేవ్ 1,2 విల్లాస్, పూజా విల్లాస్, రాక్ చర్చ్, క్రి తి విల్లాస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా అంతరాయం ఉ ంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.



పోతురాజు లక్ష్మమ్మ

## పాత్రికేయులు పి రామకృష్ణకు మాతృ వియోగం

బుద్వేల్, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం): బుద్వేల్ నివాసి, పాత్రికేయులు పోతురాజు రామకృష్ణ తల్లి పోతురాజు లక్ష్మమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమే సమాధి కార్యక్రమాలు బుద్వేల్ శ్మశాన వాటికలో జారిగాయి. పోతురాజు లక్ష్మమ్మ మరణ వార్త గురించి తెలుసుకున్న పాత్రికేయులు, వివిధ పార్టీల నాయకులు ఆమే మృత దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. పోతురాజు రామకృష్ణ ను కలసి ఓదార్చారు.



తేజస్విని కాలనీలో జరుగుతున్న నిర్మాణం

## దేవాదాయ శాఖ స్థలాలలో నిర్మాణాలు చేస్తే చర్యలు తప్పవు

**దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ క్రిష్ణ ప్రసాద్**

బుద్వేల్, ఫిబ్రవరి16(ప్రభాత ఉదయం): అత్తాపూర్ సర్వే నెంబరు 72 నుంచి 77 వరకు 8 ఎకరాల దేవాదాయశాఖ భూములు ఉన్నాయని, వాటిలో ఇప్పటికే నిర్మించి ఉన్న ఇళ్లపై కోర్టులో కేసులు నడుస్తున్నాయని, ఖాళీ స్థలాలలో నిర్మాణాలు చేయవద్దని దేవాదాయ ధర్మాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ క్రిష్ణ ప్రసాద్ అన్నారు. అత్తాపూర్ తేజస్వీని కాలనీలో సర్వే నెంబర్ 72 నుంచి 77 వరకు వచ్చే స్థలంలో 150 గజాలలో ఇళ్ళు నిర్మిస్తుండగా ఆదివారం పనులను అడ్డుకుని నిర్మాణాన్ని పాక్షికంగా కూల్చివేయడం జరిగిందన్నారు. ఈ కూల్చివేత్తలలో దేవా దాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, సూపరింటెండెంట్ మోహన్, ఈఓ అంజయ్య. ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ శ్రీనివాస్ లు పాల్గొన్నారు. అత్తాపూర్ రాంబాగ్ శ్రీ సీతారామ చంద్రస్వామీ దేవాలయంకు చెందిన భూములు ఇవన్నీ అన్నారు. ఖాళీగా ఉన్న స్థలాలను ఎవరు కొనుగోలు చేయవద్దన్నారు. త్వరలోనే కోర్టు ఆర్ధర్ వచ్చే అవకాశం ఉ ందని, అప్పుడు ఆ నివాసాలన్నింటిని స్వాధీనం చేసుకోవడం జరుగుతుందన్నారు.

## రాజేంద్రనగర్ గిరిజన బాలుర వసతి గృహంలో నాణ్యమైన ఆహారం అందించాలి: లక్ష్మీ నివాస్

బుద్వేల్, ఫిబ్రవరి16(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ గిరిజన బాలుర వసతి గృహంలో ఉంటు చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, వసతి సౌకర్యాలు అందించాలని తెలం గాణ సామాజిక విద్యార్థి సంఘం (టీఎస్ఎస్ఓ) రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీ నివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం మద్యాహ్నం ఆయన రాజేంద్రనగర్ లోని గిరిజన బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఆ సమయంలో హాస్టల్లో వార్డెన్ లేరని, వంట మనిషి లేరన్నారు. వాచ్ మెన్ తో పాటు ఒక పనివారు మాత్రమే ఉన్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు నాణ్యమైన ఆహారం అందించడంలేదని తన దృష్టికి తీసుకువచ్చారని లక్ష్మీ నివాస్ తెలిపారు. ఉడికి ఉడకని అన్నం పెడుతున్నారని, పెరుగు నీళ్లలాగ ఉంటుందని, సాంబర్ లో పప్పే ఉండటం లేదని విద్యార్థులు తెలిపారని గుర్తు చేశారు. నాసిరకమైన భోజనం పెడుతున్నారని తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం హాస్టల్ అధికారులపైన విజిలెన్స్ కమిటీ వేసి తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సిబ్బంది తో పాటు వారైన ప్రతి రోజు హాస్టల్ లో ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. పేద విద్యార్థులు ఉ ండే వసతి గృహాలలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్ఓ నాయకులు రఘు నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్ఓ నాయకులు రఘు ముదిరాజ్, సుధాకర్. సంపత్ తదితరులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ గిరిజన బాలుర వసతి గృహం వద్ద విద్యార్థులతో లక్ష్మీ నివాస్

## భగవత్ రవిదాస్ 650వ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్





అత్తాపూర్ సిఖ్ చావునిలోని గురుద్వారాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 16(ప్రభాత ఉదయం) రాజేంద్ర నగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ సిక్ చావుని లో గల గురుద్వారాలో జరిగిన భగవత్ రవిదాస్ 650 వ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిక్ చౌని వద్ద గల గురుద్వారా సాహెబ్ వద్ద జయంతి ఉ త్సవాల్లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ. సిఖ్‌ల ఆరాధ్య దైవం భగవత్ రవిదాస్ సూచించిన మార్గాన్ని అనుసరించా లన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... పండుగను ఉత్తర భారతదేశంలోని పంజాబ్ రాష్ట్రంలో అత్యంత ఆనందంగా జరుపుకుంటారు. గురు రవిదాస్ లేదా భగత్ రవిదాస్ ఒక ప్రఖ్యాత సాధువు, ఆయన భక్తి ఉద్యమానికి చేసిన కృషికి ప్రసిద్ధి చెందారు. మనమందరం ఆయన భక్తి సాధనలో ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మరో ఆధ్యాత్మిక కేంద్రంగా శ్రీ సీతారామ సమేత శ్రీ కుసుమ హరానాథ బాబా మందిరం



బుద్వేల్ కుసుమ హరనాథ బాబా మందిరంలో పూజలు చేస్తున్న రేవల్లి రాజు శర్మ



పూజలు చేస్తున్న దేవాలయ కమిటీ సభ్యులు


బుద్వేల్, ఫిబ్రవరి16(ప్రభాత ఉదయం): బుద్వేల్ శ్రీ కుసుమ హరనాథ బాబా మందిరం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ రాధాక్రిష్ణ శ్రీ సీతారామ సమేత శ్రీ కుసుమ హరనాథ బాబా మందిర నిర్మాణాన్ని చేపట్టడం సంతోషకరమైన విషయమని శ్రీ మాతా చండీ ఉపాసకులు రేవల్లి రాజు శర్మ అన్నారు. ఆదివారం ఆయన దేవాలయ నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించారు. శ్రీ సీతారామ చంద్ర స్వాములను దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా రేవతి రాజు శర్మ మాట్లాడుతూ, బుద్వేల్ లో ఆధ్యాత్మిక చింతన ఎక్కువగా ఉందన్నారు. చాలా కాలం నుంచి శ్రీ కుసుమ హరనాథ బాబా మందిరం ఆవరణలో ఉన్న దేవాలయాన్ని పెద్దది గా నిర్మించడానికి దేవాలయ కమిటీ ముందుకు వచ్చి పనులను ప్రారంభించడం సంతోషకరమన్నారు. ఇది చాలా పెద్ద ప్రాజెక్టు అని, ఖర్చుతో కూడుకున్న పని అన్నారు. అయినప్పటికి భగవత్ కార్యక్రమం కాబట్టి దేవుడే ఆ పనిని జరిగించుకుంటారని తెలిపారు. దేవాలయ నిర్మాణానికి దాతలు ముం దుకు రావాలన్నారు. ఒకరు మరో ఐదుగురికి చెప్పి దేవాలయ నిర్మాణానికి సహకరించాలన్నారు. త్వరలోనే బుద్వేల్ లో సుందరమైన దేవాలయం నిర్మాణం కాబోతుందని, ఈ దేవాలయం. రాబోయే రోజులలో అనేక మందిని ఆధ్యాత్మిక మార్గంలో నడిపించడానికి దోహదం చేస్తుందన్నారు. రాబోయే రోజులలో అనేక మందిని అధ్యాత్మిక మార్గంలో నడిపించడానికి మార్గం వేస్తుందన్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వార్డు కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించడానికి ఉన్న అధికారి

## కుల గణన సర్వే కోసం దరఖాస్తు చేసుకోండి

బుద్వేల్, ఫిబ్రవరి16(ప్రభాత ఉదయం):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సోషియో ఎకనామిక్ ఎడ్యుకేషన్ ఎంప్లాయ్మెంట్ పొలిటికల్ అండ్ క్యాస్ట్ సర్వే కు సంబంధించిన దరఖాస్తులను రాజేంద్రనగర్ సర్కిల్ వార్డు కార్యాలయాలలో తీసుకుంటున్నట్లు డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం నుంచి ఈ సర్వే ను తిరిగి చేపడుతున్నామన్నారు. ఇప్పటి వరకు కుల గణన సర్వే చేయించుకోలేని వారు అన్ని 'పనిదినాలలో వార్డు కార్యాలయాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను అందజేయవచ్చన్నారు. ఆదివారం దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించగా ఒక్కరు కూడా దరఖాస్తు చేసుకోలేదన్నారు.



అఖిల - రంజిత్ కుమార్ లను ఆశీర్వదిస్తున్న జర్నలిస్టులు

## ఘనంగా అఖిల-రంజిత్ కుమార్‌ల వివాహా వేడుక

బుద్వేల్, ఫిబ్రవరి 16 (ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్ గూడ వాస్తవ్యులు, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కాడెం సుధాకర్ - అనిత ల కుమార్తె అఖిల వివాహము చేగూరి పారిజాతం, కీర్తిశేషులు వెంకటేష్ ల కుమారుడు రంజిత్ కుమార్ తో ఆదివారం ఘనంగా జరిగింది. మైలార్దేవుపల్లి దుర్గా కన్వెన్షన్ లో జరిగిన వివాహా వేడుకలకు ఇరు కుటుంబాల బంధువులు, స్నేహితులు, రాజకీయ పార్టీల నాయకులు, జర్నలిస్టులు హాజరైనారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ తో పాటు బీజేపీ నాయకులు అంజన్ కుమార్ గౌడ్, వై శ్రీదర్, ఎన్ మల్లారెడ్డి, పి. మల్లేష్ యాదవ్, రాచూరి రాజశేఖర్, జర్నలిస్టు సంఘం నాయకులు ఆప్పారెడ్డి గూడెం భీమయ్య, మేకల దామోదర్ రెడ్డి, వర్కాల చందు, గద్దె యాదగిరి లు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోడీపై అసత్య ఆరోపణలు మానుకోండి

**జిల్లా బిజెపి అధ్యక్షులు ఎస్ రాంచంద్రారెడ్డి**

**ప్రధాని నరేంద్ర మోడీపై అసత్య ఆరోపణలు చేసిన కేజ్రీవాల్ ఏమయ్యాడో చూసారు జాగ్రత్త!**



మీడియాతో మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 16(ప్రభాత ఉదయం) సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోడీపై చేసిన అసత్య ఆరోపణలు సరియైనవి కావని ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మీ భవిష్యత్తుకు మంచిది కాదని గద్వాల జిల్లా బిజెపి అధ్యక్షులు ఎస్ రామచంద్రారెడ్డి హితవు పలికారు. ఆదివారం గద్వాల పట్టణంలోని డికె. బంగ్లా లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో బీజేపీ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు ఎస్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను చూస్తుంటే గురువింద నీతి గుర్తుకు వస్తుందని ఎద్దేవ చేశారు.రేవంత్ రెడ్డి రాజకీయాల్లో నీతి ఉండాలి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి అప్పుడే ని మాటకు విలువుంటుందని విమర్శించారు. నీలాంటి అసత్య వ్యాఖ్యలకు మా పార్టీ సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు కానీ ప్రజా క్షేత్రం లో ఉన్నాం కాబట్టి గౌరవంగా సమాధానం చెబుతున్నామన్నారు.రేవంత్ రెడ్డి మీరు మొన్న మాట్లాడుతూ మా ప్రధాని మోడీ కులాన్ని ప్రస్తావిస్తూ మోడీ అగ్రకులాలకు చెందిన వ్యక్తి అతడు కన్వర్ట్ బీసీ గా మారాడు అని చెబుతూ మీరు విమర్శించడం మీ తెలివితక్కువ తనానికి నిదర్శనమన్నారు.కన్వర్ట్ అనే పదానికి అర్థం తెలుసుకోండి ముఖ్యమంత్రి బీసీ లలో వేల సంఖ్యలో కులాలు ఉన్నాయి మీరు గుజరాత్ లో ఉన్న కులాలను కొన్ని మీ 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఎన్నో కులాలను వర్గీకరణ పేరుతో మారుస్తూ కులాల కుంపటి రాజేసి ఆ అగ్గిలో చాలికాచుకున్న ప్రభుత్వాల్లో మొట్టమొదటి ప్రభుత్వం కాంగ్రెస్ మాత్రమేనని ఆయన తీవ్రంగా విమర్శించారు. 2001 లో గుజరాత్ ముఖ్యమంత్రి గా మోడీ తన కులాన్ని బీసీ లో చేర్చిండు అని చెప్తున్న మీరు ఒక్కరోజులోనే తన కులాన్ని బీసీ లో చేర్చడానికి అవకాశం ఉంటుందా అని జిల్లా అధ్యక్షుడు ప్రశ్నించారు.1994 లోనే గుజరాత్ లో మీ కాంగ్రెస్ ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడే ఆ కులాన్ని బీసీ లో చేర్చాలని చట్టబద్ధత తెస్తే దానిని కేంద్ర ప్రభుత్వకు నివేదిక పంపిస్తే అది పూర్తి చేసిన తరువాతనే 2001 లో తను ముఖ్యమంత్రి గా వచ్చినప్పుడు అది అమల్లోకి వచ్చింది తప్పా దింట్లో మోడీ పాత్ర ఎంతుందో మిరే చెప్పండి బ్లాక్మెయిల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. ఒక కులానికి చట్టబద్దత కల్పించాలన్న వారి రిజర్వేషన్లు సరిచేయలన్న,వారికి ఏబిసిడి లో మార్చలన్న ఎంత తతంగం ఉంటుందో మీకు తెలియదా జాక్ పాట్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని గుర్తు చేశారు.ముదిరాజ్ లను ఏ క్యాటగిరిలో చేర్చాలని అడిగిన వారికి,బోయాలను ఎస్ టి జాబితాలో చేర్చాలన్న వారి డిమాండ్ ను,కురువలను మాదాసి కురువలుగా మార్చలన్న డిమాండ్ ను కానీ 30 ఏళ్ల మందకృష్ణ మాదిగ పోరాటాన్ని కానీ వీరందరి డిమాండ్ ను ఇప్పుడు మీరు ముఖ్యమంత్రి గా వున్నారు కదా మీ చేతిలో పని కదా వారి డిమాండ్ లన్ని తీర్చేయ్యండన్నారు. అవగాహన లేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.......వీటన్నింటికి రాష్ట్రంతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా కావాలి అనే అంశం మీకు తెల్వద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని జిల్లా అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి ప్రశ్నించారు.

మీకు చేతనైతే మీరిచ్చిన ఆరు గ్యారంటీ లపై దృష్టి పెట్టి ప్రజా అవసరాలు తీర్చండి మీ పాలన పై మీ పార్టీ నాయకులు చేస్తున్న దాడి ని తప్పించుకోవడానికి డైవర్ట్ పాలిటిక్స్ చెయ్యొద్దండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,మీరు తెలివిగా మాట్లాడుతున్న అనే ఆలోచనతో ఉన్నట్టున్నారు. మిమ్మల్ని ప్రజలే అసహ్యించుకునేటట్టు చేసుకుంటున్నారు జాగ్రత్త అని హెచ్చరించారు.మీరు మొదటగా తెలంగాణ లో కులగణన చేశారా మతగణనా చేశారా...

మీరు మీ ప్రభుత్వం హిందు బీసీ లు,ముస్లిం బీసీ లుగా ఎందుకు చెప్తున్నారో దానికి క్లారిటీ ఇవ్వండని ఆయన కోరారు. బీసీ లపై ప్రేమ ఉంటే మాకు సంబంధించిన రిజర్వేషన్లలో ఎవ్వరికీ వాటా ఇవ్వమని చట్టబద్ధత తీసుకొని రండని ఆయన విజ్ఞప్తి చేశారు.మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల పోరాట ఎస్సీ వర్గీకరణకు ముగింపు చేసిన కేంద్రం వాటి ఏబిసిడి వర్గీకరణ ఎప్పుడు పూర్తి చేస్తారో దానికి సమాధానం చెప్పండన్నారు.వీటి పరిష్కారం లో మీ పాత్ర మీ ప్రతిభ ఎంత చక్కగా నిర్వహిస్తారో ఎదురు చూస్తున్నాము మీకు కేంద్రాన్ని విమర్శించే అర్హత లేదు అన్నది తెలంగాణ ప్రజలందరికీ తెలుసన్నది మీరు ఒక ముఖ్యమంత్రి హెూదాలో తెలుసుకోండన్నారు.

ఇక ప్రధాని నరేంద్ర మోడీ గురించి మీకు రెండు మాటల్లో మోడీ బీసీ నా,ఓబీసీ నా అనే కదా మీ అనుమానం అన్ని మతాలు అన్ని కులాలు దేశమంతా ఒక్కటే అనే నినాదం తో దేశానికి ప్రధాని అయ్యిండు. మీకు నరేంద్రమోదీ గురించి తెలియలాంటే... జీవో 370 ఎత్తేసి కాశ్మీర్ ను భారత భూభాగం లో ఐక్యం చేసిన అక్కడి కాశ్మీర్ ప్రజలను అడుగు తెలుస్తుందన్నారు.ట్రిపుల్ తలాక్ ఎత్తేసి వారి జీవితాల్లో వెలుగులు నింపిన ముస్లిం మహిళలను అడుగుతే తెలుస్తుంది అన్నారు. అబ్దుల్ కలాం ను భారత ప్రధానిని ఈ దేశ ప్రజలను అడుగు,ఒక దళితుడు అయిన రామ్ నాథ్ కివింద్ ను రాష్ట్రపతి ని చేసిన దళిత వర్గాన్ని అడుగు, ఎస్టి వర్గానికి సంబంధించిన ద్రౌపది ముర్ము ని రాష్ట్రపతి ని చేసిన ఆ వెనకబడిన ఎస్ టి వర్గాన్ని అడుగు,30 ఏళ్ల మందకృష్ణ మాదిగ పోరాటానికి ఫుల్ స్టాప్ పెట్టించిన నరేంద్ర మోడీ గురించి మందకృష్ణ మాదిగాను అడుగు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీరు అదృష్ట వశాత్తు జాక్ పాట్ గా ముఖ్యమంత్రి కుర్చీలో వున్నారు. పోరాటం లేదు సమస్యల మీద ఎన్నడూ ఏ పోరాటం చెయ్యలేదు అందుకే మీరు అహంకార ధోరణితో మీ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు ..ఇంకొక్కసారి నరేంద్రమోదీ గారి పై కానీ బీజేపీ ప్రభుత్వం పై కానీ అనవసరంగా అవాకులు చెవాకులు పేలితే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుంది .తస్మాత్ జాగ్రత్త అంటూ జిల్లా అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి డికె. స్నిగ్ధా రెడ్డి ,జిల్లా ఉపాధ్యక్షుడు రజక నరసింహ, అసెంబ్లీ మాజీ కన్వీనర్ రామాంజనేయులు, అసెంబ్లీ కి పోటీ చేసిన అభ్యర్థి బలిగేరా శివారెడ్డి,పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ,బిజెపి సీనియర్ నాయకులు బండల వెంకట రాములు, దేవదాస్,డబ్బిలేటి నరసింహ, తదితరులు ఉన్నారు.



సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీకి సన్మానం చేసిన కొత్తకోట పట్టణ, మండల నాయకులు

# కార్మికులకు కనీస వేతనాలు పెంచేందుకు పోరాటం చేస్తాం

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీకి ఘన స్వాగతం**

కొత్తకోట, ఫిబ్రవరి 16(ప్రభాత ఉదయం) వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు పెంచేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. ఆదివారం నూతనంగా ఎన్నికైన తెలంగాణ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ కి కొత్తకోట మండల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో ఘనసాగతం పలికారు. ఈ సందర్భంగా మదనపురం మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, బిల్డింగ్ కార్మికులు, మున్సిపల్,హమాలి,అంగన్వాడి,ఆశ ఆర్ పి గ్రామపంచాయతీ కార్మికులు జాన్ వెస్లీ కి పూలమాలలు వేసి శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయా రంగాల కార్మికులు తమ సమస్యలు పరిష్కారం కొరకు పోరాటం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జాన్ వెస్లీ మాట్లాడుతూ ...మున్సిపల్ కార్మికులు హమాలీ బిల్డింగ్ వర్కర్స్ గ్రామపంచాయతీ ఆర్పి కార్మికులు అంగన్వాడి ఆశ రంగాల కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్టాంజనేయులు, సిపిఎం మండల కార్యదర్శి బొబ్బిలి నిక్సన్, బిల్లింగ్ వర్కర్స్ అధ్యక్షులు కే వెంకటయ్య, మున్సిపల్ కార్మికుల సంఘం అధ్యక్షులు కే. కృపయ్య, హమాలి కార్మిక సంఘం అధ్యక్షులు నెల్లూరు కురుమన్న, వెంకటేష్, నరసింహులు, అంగన్వాడి నాయకురాలు వెంకటేశ్వరమ్మ, వనజ,కుమారి,ఐకెపి ఆర్పి నాయకురాలు లావణ్య, ప్రశాంత,ప్రసన్నకుమారి,తదితరులు పాల్గొన్నారు.



క్రీడల్లో విజేతలకు సీల్డు అందజేస్తున్న మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి

# యువత క్రీడల్లో రాణించాలి

**ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి**

**జాతీయస్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీలలో కొత్తకోట మాస్టర్ కి ఓవరాల్ గ్రాండ్ ఛాంపియన్షిప్ బెస్ట్ మాస్టర్‌ను అభినందించిన మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి**

కొత్తకోట, ఫిబ్రవరి 16(ప్రభాత ఉదయం) యువత క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మక్తల్ ఎమ్మెల్యే వాకాటి శ్రీహరి అన్నారు. ఆదివారం నారాయణపేటలోని ఎస్సార్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన 24వ జాతీయస్థాయి కరాటే ఓపెన్ ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ రాష్ట్రాల నుండి వెయ్యి మంది విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు ఈ పోటీలకు మన కొత్తకోట చెందిన గాడ్స్ ఆన్ వారియర్స్ షోతో ఖాన్ కరాటే డు ఇండియా విద్యార్థి విద్యార్థులు పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచి బంగారు వెండి పథకాలు సాధించారు. ఈ సందర్భంగా కొత్తకోటకు ఓవరాల్ గ్రాండ్ చాంపియన్షిప్ సాధించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మక్తల్ శాసనసభ్యులు డాక్టర్ శ్రీహరి బికేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణ రెడ్డి ముఖ్య అతిథుల చేతుల మీదుగా సీనియర్ కరాటే మాస్టర్ జై సుమ కి ఓవరాల్ గ్రాండ్ ఛాంపియన్షిప్ అందించి అభినందించారు ఈ సందర్భంగా కొత్తకోట సీనియర్ మాస్టర్స్ జి హరీష్ యాదవ్ ఇంతియాజ్ అంజీలను క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీని ప్రత్యేకంగా అభినందించారు.




# ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో దోహదం

**వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్**

కొత్తకోట, ఫిబ్రవరి 16(ప్రభాత ఉదయం) ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో దోహదం చేస్తాయని మదనాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ అన్నారు. ఆదివారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని 14వ వార్డులో గల ఎంబి చర్చి ఆవరణలో మండల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు జనుంపల్లి ఇజ్రాయిల్ ఆధ్వర్యంలోవనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన శ్రీ సాయి నేత్రాలయ కంటి ఆసుపత్రి వైద్యులు ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మదునాపురం మార్కెట్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. విశిష్ట అతిథులుగా 14వ వార్డు మాజీ కౌన్సిలర్ పద్మ అయ్యన్న ,15వ వార్డు మాజీ కౌన్సిలర్ ఖాజ మైనోద్ధిన్,సిఐటియు జిల్లా కార్యదర్శి బొబ్బిలి నిక్సన్,మాజీ వార్డు సభ్యులు సుందర్ రాజులు, ప్రవీణ్ కుమార్,శ్రీనివాసులు,సంజీవ, దివాకర్,కరుణ కుమార్,నవీన్ తదితరులు పాల్గొన్నారు.ఇదిలా ఉండగా శ్రీ సాయి నేత్రాలయ కంటి ఆసుపత్రికి చెందిన ఆప్టమ్ డాక్టర్లు రామకృష్ణ,శ్రీనివాసులు కంటి శిభిరంలో పాల్గొన్న వారికి కంటి పరీక్షలు నిర్వహించగా.. ఆసుపత్రి మార్కెటింగ్ ఆఫీసర్లు రాము,వెంకటేష్ లు పాల్గొనగా..ఆదివారం మధ్యాహ్నం వరకు 14,15వ వార్డులకు చెందిన 60 మంది పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించుకొన్నట్లు డాక్టర్ రామకృష్ణ తెలిపారు.

# కొండాపురంలో విద్యుత్ మోటార్ చోరీ?

కేటి దొడ్డి, ఫిబ్రవరి 16(ప్రభాత ఉదయం) కేటిదొడ్డి మండలంలోని కొండాపురం గ్రామ పంచాయతీకి చెందిన స్మశాన వాటికలో ఉన్న విద్యుత్ మోటార్ గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటన ఆల్యసంగా వెలుగులోకి వచ్చింది. అదే విధంగా గ్రామంలో చెత్త సేకరించేందుకు ఉపయోగించే గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ట్రాలీ టైర్లు కొత్తవి మార్చి పాతవి వేశారంటూ గ్రామస్తులు ఆరోపించారు. కొండాపురం గ్రామంలో స్మశాన వాటికలో ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్ గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు గ్రామాస్తులు ఆరోపించారు. గ్రామ సర్పంచ్ పదవీ కాలం ముగియడంతో పంచాయతీ కార్యదర్శులు గ్రామాన్ని పర్యవేక్షిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు తమ విధులు ముగించుకుని వెళ్లిపోవడంతో గ్రామాలలో పర్యవేక్షణలేక...




గ్రామ పంచాయతీకి సంబంధించిన వస్తువులు దొంగలు ఎత్తుకెళ్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పోలీసులు విచారణ జరిపి దొంగలను పట్టుకొని కఠినంగా శిక్షించాలని కోరారు.

# సింగిల్ విండో డైరెక్టర్ ఎం శ్రీనివాసులు, సుచరిత దంపతుల కుమార్తె గగన శ్రీ (చందన), అభిలాష్ నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రముఖులు



నూతన వధువు వరులను ఆశీర్వదిస్తున్న సి డి సి మాజీ చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి

కొత్తకోట, ఫిబ్రవరి 16(ప్రభాత ఉదయం) కొత్తకోట మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన సింగిల్ విండో డైరెక్టర్ ఎం శ్రీనివాసులు, సుచరిత దంపతుల కుమార్తె గగన శ్రీ (చందన), అభిలాష్ నూతన వధూవరుల వివాహ వేడుకల్లో దేవరకద్ర నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు ఆల వెంకటేశ్వర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు . ఆదివారం విలియం కొండ జె.వి.ఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగిన వివాహ వేడుకల్లో వనపర్తి జిల్లా పరిషత్ మాజీ జడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్ , కొత్తకోట మండల మాజీ ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్ , మాజీ సి డి సి చైర్మన్ బీసం చెన్నకేశవరెడ్డి, మాజీ సి డి సి చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి, రిటైర్డ్ హెడ్మాస్టర్ ఎం శేఖర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర రెడ్డి, కాంట్రాక్టర్ మూలమల్ల చక్రగిరి వర్ధన్ రెడ్డి, రామకృష్ణాపురం గ్రామం బి ఆర్ ఎస్ అధ్యక్షులు మూలమల్ల యుగంధర్ రెడ్డి, ఎం లోక రెడ్డి, ఆకుల శ్రీనివాసులు, గుంత మల్లేష్, గాడిలా ప్రశాంత్, మూలమల్ల చక్రగిరి వర్ధన్ రెడ్డి, గులాబీ గోవింద్, తిరుపతి గౌడ్, జగతి (జగదీష్), మహీముద్, మొగులన్న, శివప్రసాద్, వెంకటయ్య, రవి, రమేష్, ఎం శేఖర్ కొండారెడ్డి అప్పరాల గ్రామానికి చెందిన రఘు వర్ధన్ రెడ్డి రవీందర్ రెడ్డి, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు





నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి



మహిళ ఆత్మహత్య యత్నం ప్రాణాలు కాపాడిన యువకులు

# సి.పి.ఆర్ ద్వారా మహిళలను రక్షించిన యువకులు

కొత్తకోట, ఫిబ్రవరి 16(ప్రభాత ఉదయం) కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామ చెరువు తూము దగ్గర పామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన 45 ఏళ్ల మహిళ కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడింది. విషయం గమనించి అటువైపుగా వెళుతున్న గ్రామానికి చెందిన యువకులు బోయ రాకేష్, నక్కలి చందు, వెంటనే చెరువులోకి దూకి మహిళను రక్షించారు. అప్పటికే మహిళ నోటిలోకి నీరు వెళ్లడంతో అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. అయినా మహిళను రక్షించాలన్న సంకల్పంతో యువకులు సిపిఆర్ చేయాలని ఆలోచించారు. అనుకున్నదే తడువుగా ఇద్దరు కలిసి మహిళకు సిపిఆర్ చేయడంతో తిరిగి ఆమె ఊపిరి తీసుకుందని తెలిపారు. ఒకవైపు సిపిఆర్ చేస్తూనే మరోవైపు పోలీసులకు అంబులెన్స్ కు సమాచారం ఇచ్చి వారు వచ్చేలోగా ఆమెకు సిపిఆర్ తో చికిత్స చేశారు. కోలుకున్న ఆ మహిళను పోలీసుల సమక్షంలో అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మహిళ ప్రాణాలు కాపాడిన గ్రామ యువకులైన రాకేష్, చందు,ను పోలీసులు అభినందించారు. ప్రతి ఒక్కరూ ఈ విధంగా ధైర్యంతో మహిళా ప్రాణాలను కాపాడిన యువకులకు అటు పోలీసులు ఇటు గ్రామస్తులు అభినందనలు తెలియజేస్తున్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608